సాక్షి
నిజామాబాద్

శనివారం । 14 । అక్టోబర్ । 2023



వర్సిటీలో బతుకమ్మ వేడుక

తెలంగాణ యూనివర్సిటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

- IIలో ▸



అక్రమాల నిరోధానికి బృందాలు

ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లాలో అక్రమాల నిరోధానికి మూడు ప్రత్యేక బృందాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.7

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సునీల్‌రెడ్డి ఇంట్లో విషాదం



సమన్వి(ఫైల్)

బాల్కొండ : కాంగ్రెస్ నాయకుడు, ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. గురువారం రాత్రి ఆయన కుమార్తె సమన్వి (16) అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందింది. అదే రోజు రాత్రి మృతదేహన్ని మెండోరా మండలం సావెల్ గ్రామంలో ఆయన స్వగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సునీల్‌రెడ్డిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ అర్వింద్, మాజీ ప్ర భుత్వ విప్ ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షు డు మానాల మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నా యకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డిలు శుక్రవారం ఆయన నివాసంలో పరామర్శించారు.

ఎస్సారెస్పీ నుంచి పెరిగిన నీటి విడుదల

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కుల కు నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు పెంచారు. లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 7,518 క్యూసెక్కుల వరద నీరువచ్చి చేరుతోంది.

సీఎం కేసీఆర్‌కు గట్టి బందోబస్తు



వేల్పూర్/భీమ్‌గల్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి వేముల మంజుల అంత్యక్రియలకు హాజరైన సీఎం కేసీఆర్‌కు పోలీసులు శుక్రవారం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11.30కు హెలీక్యాప్టర్‌లో సీఎం కేసీఆర్ వేల్పూర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పీహెచ్‌సీ, అంబేడ్కర్ చౌరస్తా, ప్రధాన రోడ్డు మీదుగా సీఎం కాన్వాయ్ మంత్రి ఇంటికి చేరుకుంది. నివాళులర్పించే కార్యక్రమంలో సుమారు పది నిమిషాలు పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు. మినీ స్టేడియంలో సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, బిగాల గణేష్‌గుప్తా, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, ఐడిహెచ్‌ఎఫ్ చైర్మన్ మధుశేఖర్, కోటపాటి నర్సింహానాయుడు కలిశారు.

ప్రజావాణి రద్దు

ఖలీల్‌వాడి: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఎన్నికల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



ఖలీల్‌వాడి : అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని రూం నెం.28లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. డీపీఆర్వో ఎన్ పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ వేణి ప్రసన్న, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల పర్యవేక్షకుడు పవన్ పాల్గొన్నారు.

కామారెడ్డి ఎస్పీగా సింధు శర్మ




సాక్షి, కామారెడ్డి: జిల్లా ఎస్పీగా సింధు శర్మ నియమితులయ్యారు. ఆమె శుక్రవారమే బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాక పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. ఇందులో కామారెడ్డి ఎస్పీగా పనిచేసిన నాన్ క్యాడర్ ఐపీఎస్ అధికారి బి.శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

ప్రశ్నిస్తే దాడులు..!

- నిలదీసిన వారిని భయపెట్టాలని జిల్లాలోని ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉచిత సలహాలు
- ఆయనతో ఉంటే తిప్పలు తప్పవని భావిస్తున్న నాయకులు
- బీజేపీ, కాంగ్రెస్ నేతలతో మంతనాలు చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

ప్రచార ఘట్టం నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా నిలదీసినా, ప్రశ్నించినా సదరు వ్యక్తులను భయపెట్టాలని, అవసరమైతే భౌతిక దాడులు కూడా చేయాలంటూ జిల్లాలోని ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులకు, తృతీయ శ్రేణి కేడర్‌కు సూచిస్తుండడం చర్చనీయాంశమైంది.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఇలా ఉచిత సలహాల నేపథ్యంలో తమకు ఇదేం పరిస్థితని ఆయా నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేస్తుండడం విశేషం. ప్రజలతో సామ్యంగా ఉండాల్సిన నేపథ్యంలో ఇలాంటి వ్యవహారశైలి కలిగిన సదరు సిట్టింగ్ చెప్పినట్లు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చర్చించుకుంటుండడం గమనార్హం.

ఇప్పటికే వ్యతిరేకత

ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న ఎమ్మెల్యే ఓటమిపాలయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో సదరు ఎమ్మెల్యేతో కలిసి ఉంటే తర్వాత అవస్థలు పడాల్సి ఉంటుందని బాహాటంగానే మాట్లాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే తమకు బిల్లులు రాక నానా అగచాట్లు పడుతున్నామని, ఎమ్మెల్యే కూడా బిల్లులకు అడ్డం పడిన సందర్భాల్లో ఆత్మహత్యయత్నాలు చేసిన ఘటనలు కూడా చోటు చేసుకున్నా యి. దీంతో మెజారిటీ సంఖ్యలో సర్పంచ్‌లు విషయాలపై అంతర్గతంగా సీరియస్‌గా చర్చించుకుంటున్నా రు. ఈ క్రమంలోనే చాలా మంది సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలకు టచ్‌లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. తగిన సమయం చూసి ఆయా పార్టీల్లో చేరేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేకు మద్దతు ఇవ్వకూడదని ఇప్పటికే పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సదరు ఎమ్మెల్యే ప్రవర్తన, వ్యవహారశైలితో తాము విసిగిపోయామని, మళ్లీ ఆ ఎమ్మెల్యేతో తిరిగితే ఇబ్బందులు తప్పవనే ఆలోచనతో ముందే పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండడం విశేషం. ఇచ్చిన హామీలు నెరవేర్చితే హుందాగా ఓట్లడిగే అవకాశాన్ని వదులుకుని ఇప్పుడు తమతో ఓటర్లకు తాయిలాలు పంచిస్తే లాభం లేదని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెబుతుండడం విశేషం.

ధాన్యం కొనుగోళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

- రైతులకు ఇబ్బందులు ఉండకుండా చూడాలి
- 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ . 2,203, సాధారణ రకానికి రూ . 2,183
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఖలీల్‌వాడి: ధాన్యం సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ చేట్టాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అధికారులు, సిబ్బంది తప్పిదాలతో రైతులు ఆందోళనలకు దిగితే, సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేవరకు పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యతాప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యపర్చాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీల పాత్ర పోషించాలని, రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. హమాలీలను అందుబాటులో ఉంచడంతోపాటు సేకరించిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు వాహనాలను సమకూర్చుకోవడంతోపాటు నిల్వ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలన్నారు.

అధికారులే ప్రారంభించాలి

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించకూడదని, అధికారులు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఫ్లెక్సీల్లో రైతులకు ఉపయోగపడే సూచనలు మాత్రమే ముద్రించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను చేస్తే ఉపేక్షించబోమన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామన్నారు.

జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయసహకారాలు అందిస్తామని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ చంద్రప్రకాశ్, డీసీఓ సింహాచలం, జిల్లా వ్యవసాయఅధికారి వాజీద్ హుస్సేన్, డీఆర్డీఓ చందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీగా కల్మేశ్వర్ బాధ్యతల స్వీకరణ



ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఎస్ కల్మేశ్వర్ శుక్రవారం రాత్రి 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. మూడు రోజుల క్రితం నిజామాబాద్ సీపీ సత్యనారాయణను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. సత్యనారాయణ 40 రోజులపాటు జిల్లాలో సీపీగా పని చేశారు. అంతకు ముందు సీపీ కెఆర్ నాగరాజు రిటైర్డ్ అయిన తర్వాత 4 నెలల పాటు సీపీ పోస్ట్ ఖాళీగా ఉంది. సెప్టెంబర్ 2న సీపీగా సత్యనారాయణ బాధ్యతలు చేట్టారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత పనితీరులో సక్రమంగా లేకపోవడంతోపాటు పలు రాజకీయ పార్టీలు ఈసీకి ఫిర్యాదులు చేయడంతో సీపీగా ఉన్న సత్యనారాయణను బదిలీ చేసినట్లు జిల్లాలో ప్రచారం జరిగింది. తాజాగా నిజామాబాద్ సీపీ పోస్టుకు సీఎస్ శాంతికుమారి ముగ్గురు పేర్లను ఈసీకి నివేదించారు. దీంతో హైదరాబాద్‌లోని సైబరాబాద్ (క్రైం)లో డీసీపీగా పని చేస్తున్న కల్మేశ్వర్‌ను శుక్రవారం మధ్యాహ్నం నిజామాబాద్ సీపీగా నియమించింది. 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. గతంలో వివిధ ప్రాంతాల్లో ఎస్పీ గా పనిచేసిన అనుభవం ఉంది. కల్మేశ్వర్‌కు నిక్కచ్చిగా పనిచేసే అధికారిగా పేరుంది. దీంతో రాబోయే ఎన్నికల్లో తనదైన ముద్ర వేస్తారనే చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది. సీపీ సతీమణి రోహిణి మెదక్ ఎస్పీగా ఉన్నారు.

కార్యదర్శే 'ఆసరా'

- వేలిముద్రలు రాని వారికి పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 15,335 మంది బాధితులు
- ప్రతినెలా లబ్ధిదారులకు ఇదే పరిస్థితి



తొండాకూర్‌లో వేలిముద్ర వేస్తున్న పంచాయతీ కార్యదర్శి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆసరా పింఛన్లు పొందాలంటే కొంతమందికి తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు వేలిముద్రలు నమోదు కాకపోవడంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఆధారపడాల్సి వస్తోంది. కార్యదర్శి తన వేలిముద్రలు పెడితే తప్పా లబ్ధిదారుల చేతికి పింఛన్ డబ్బులు అందని పరిస్థితి నెలకొంది. ఈ విధంగా జిల్లాలో వేలమంది బాధితులున్నారు. ఆసరా పింఛన్లు పొందేవారికి రాష్ట్ర ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరి చేసింది. పింఛన్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. నూటికి తొంభై శాతం మందికి వేలిముద్రలు నమోదవుతున్నాయి. కానీ, కొందరు వృద్ధులకు వేలిముద్రలు అసలే పడడం లేదు. ఆధార్‌లో అప్‌డేట్ చేసుకున్నా కూడా రావడం లేదు. తద్వారా ఇలాంటి వారికి పింఛన్లు అందజేయడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి వేలిముద్రను ప్రామాణికం చేసింది. గత కొన్నేళ్లుగా కార్యదర్శులే వేలిముద్ర వేసి పింఛను అందజేస్తున్నారు. ఈ విధంగా ప్రతిగ్రామ పంచాయతీలో 30 నుంచి 70 మంది బాధితులున్నారు.

జిల్లాలో 15,335 మంది..

వేలి ముద్రలు రాని లబ్ధిదారులు ప్రతినెలా పింఛను పొందాలంటే పంచాయతీ కార్యదర్శిపైనే ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలో మొత్తం పింఛన్లు 2,78,432 ఉండగా, ఇందులో అత్యధికంగా 72,614 మంది వృద్ధులు, 55,789 మంది వితంతులు ఉన్నారు. కాగా, దివ్యాంగులు 19,396 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలిముద్రలు రానివారు 15,335 మంది ఉండగా, వారిలో ఎక్కువ వయస్సున్న వృద్ధులు, వితంతులు ఉన్నారు. నడవలేనిస్థితిలో ఉన్న దివ్యాంగులు కూడా ఉన్నారు. ఇలాంటి వారికి పోస్టల్ అధికారులు పంచాయతీ కార్యదర్శుల నుంచి బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. పట్టణాల్లో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే పింఛన్ డబ్బులు జమవుతుండగా, గ్రామాల్లోనే పోస్టల్ అధికారులు పంపిణీ చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లోనే వేలిముద్రల సమస్య ఎక్కువగా ఉంది. అత్యధికంగా నందిపేట్ మండలంలో 1,554 మంది, నవీపేట్‌లో 985 మంది బాధితులున్నారు. తమకు కూడా బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమచేస్తే బాగుంటుందని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాలోని మండలాల్లో పింఛన్ల వివరాలు

ఆర్మూర్	611	ఇందల్వాయి	545	మోస్రా	126	రెంజల్	612
బాల్కొండ	445	జక్రాన్‌పల్లి	730	మోపాల్	475	రుద్రూర్	289
భీమ్‌గల్	564	కమ్మర్‌పల్లి	484	ముప్కాల్	259	సిరికొండ	489
బోధన్	775	కోటగిరి	670	నందిపేట్	1554	వర్ని	481
చందూర్	160	మాక్లూర్	847	నవీపేట్	985	వేల్పూర్	406
ధర్పల్లి	540	మెండోరా	371	నిజామాబాద్ రూరల్	391	ఎడపల్లి	652
డిచ్‌పల్లి	786	మోర్తాడ్	332	మున్సిపల్ కార్పొరేషన్	337	ఏర్గట్ల	207

మంత్రి మాతృమూర్తికి అశ్రునివాళి



వేల్పూర్‌లో వేముల మంజులమ్మ అంతిమయాత్ర

- ప్రశాంత్‌రెడ్డిని ఓదార్చిన కేసీఆర్
- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



నివాళులు అర్పిస్తున్న స్పీకర్ పోచారం

వేల్పూర్/భీమ్‌గల్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందగా శుక్రవారం వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో ఆమెకు సీఎం కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ జోగినపల్లి సంతోష్, ఎంపీలు అర్వింద్, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, బిగాల గణేష్ గుప్తా, రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, ఐడిహెచ్‌ఎఫ్ చైర్మన్ మధుశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, బాజిరెడ్డి జగన్, రాజారాం యాదవ్, బీజేపీ నాయకులు భూపతిరెడ్డి, పల్లె గంగారెడ్డి, బస్వా లక్ష్మీనారాయణ, గోర్త రాజేందర్ తదితరులు మంత్రి తల్లి మంజులమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ప్రశాంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

వేముల మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పెద్దవాగు ఒడ్డున ఉన్న వైకుంఠధామంలో జరిగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కుటుంబీకులు, బంధువులు తదితరులు వేలాదిగా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మంజులమ్మ చిన్న కుమారుడు వేముల అజయ్‌రెడ్డి ఆమె చితికి నిప్పంటించారు.






నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ ధర్మపురి అర్వింద్

వేతన వెతలు

- ప్రతినెలా 10దాటినా అందని జీతం
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో ప్రతినెలా ఒకటో తారీఖున క్రెడిట్ అవ్వాల్సిన వేతనాలు పదో తేదీ దాటినా అవడం లేదు. ఇంటిఅద్దె, ఈఎంఐల చెల్లింపు, నిత్యావసర సరుకుల కొనుగోలు భారాన్ని ప్రతినెలా ఏ తేదీ వరకు భరించాలో తెలియక ఉద్యోగులకు కంటిమీద కునుకు కరువవుతున్నది. గత రెండేళ్లుగా జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోపక్క ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బిల్లులన్నీ నిలిచిపోయాయి! రుణాలు, అడ్వాన్సులు, రియింబర్స్‌మెంట్ బిల్లులకు గత కొన్ని నెలలుగా మోక్షం లభించడం లేదు. ఖజానా కార్యాలయం నుంచి టోకెన్లు జనరేట్ అవుతున్నప్పటికీ ఈ – కుబేర్ నుంచి డబ్బులు మాత్రం ఉద్యోగుల ఖాతాల్లో జమ కావడం లేదు.

బిల్లులన్నీ పెండింగ్!

ఉద్యోగుల సరెండర్ లీవ్, మెడికల్ రియింబర్స్‌మెంట్ , టీఎస్ జీఎల్ఐ క్లైములు, జీపీఎఫ్, పీఆర్సీ బకాయిలు తదితర బిల్లులన్నీ ట్రెజరీలో గత కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. ఫలితంగా గృహనిర్మాణం, ఆరోగ్య సంబంధ విషయాలు, శుభకార్యాలు, పిల్లల చదువులు తదితర వాటికి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు జమ చేసుకున్న సొమ్ము ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడంతో అవసరాల నిధి అక్కరకు రాకుండా పోయింది. అలాగే పీఆర్సీ, ఏరియర్స్ బిల్లులు, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు చాలా నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సమయం ముగిసిన లైఫ్ ఇన్సురెన్స్ బాండ్ల క్లైముల బిల్లులు అందక రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉద్యోగుల వైద్యానికి సంబంధించిన రెండు లక్షలలోపు అత్యవసర మెడికల్ బిల్లులు కూడా మంజూరు కావడం లేదు.

నూతన పద్ధతిలో నేరుగా ఖాతాలోకే..

బిల్లుల చెల్లింపు కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టంను తీసుకువచ్చింది. దీని ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులను డీడీఓలు తయారుచేసి ఎస్‌టీఓ కార్యాలయాలకు పంపిస్తారు. ఆ వెంటనే టోకెన్ నంబర్ జనరేట్ అవుతుంది. దాని ఆధారంగా సొమ్ము మంజూరు కావాలి. ఇంతకు ముందు టోకెన్ జనరేట్ అయినా కొన్ని రోజులకే ఉద్యోగుల ఖాతాల్లో బిల్లుల సొమ్ము జమయ్యేది. ప్రస్తుతం బిల్లు క్లియర్ కావాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఉండాల్సిందే. ట్రెజరీ శాఖకు చెందిన ఆడిట్ అధికారులు ఆడిట్ చేసిన అనంతరం బిల్లులు ఈ-కుబేర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఖజానాశాఖకు వస్తున్న రాబడుల ఆధారంగా బిల్లులను మంజూరు చేస్తారు.

ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

ప్రతి నెలా ఒకటో తేదీన టీచర్లకు, ఉద్యోగులకు జీతాలు అందాలి. ప్రభుత్వం ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ తీసుకురావాలి. జీతాలు ఆలస్యం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం.

–వెనిగళ్ల సురేశ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అందరికీ ఒకేసారి ఇవ్వాలి

భీమ్‌గల్ ఎస్‌టీఓ పరిధిలో ప్రతినెలా 10 తర్వాతే జీతాలు వస్తున్నాయి. అందరికీ ఒకటో తేదీనే జీతాలు వెయ్యాలి. జీతాలు సకాలంలో అందకపోవడంతో లోన్లు చెల్లించలేకపోతున్నాం.

–నరేశ్, ప్రభుత్వ టీచర్

రేపటి నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు



నగరంలోని బోర్గాం(పి)లో సిద్ధమైన మండపం

నిజామాబాద్ సిటీ : జిల్లాలో రేపటి నుంచి దేవి శరన్నవరాత్రోత్సవాలు మొదలుకానున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో దేవిరోడ్డులో దేవిమాత మందిరం, ఆర్యవైశ్య సంఘంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం మండపాలు తీర్చిదిద్దారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మీ దేవి, 19న లలితా త్రిపురసుందరీ దేవి, 20న సరస్వతి దేవి (మూల నక్షత్రం), 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్దిని దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇక చివరి రోజైన 23న రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిస్తారు.

నేటి నుంచి బతుకమ్మ పండుగ

రాష్ట్రంలో ఘనంగా జరుపుకునే బతుకమ్మను పండుగ నేటి నుంచి మొదలుకానుంది. ఇందులో భాగంగా నేడు తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, 2వ రోజు అటుకుల బతుకమ్మ, 3వ రోజు ముద్దపప్పు బతుకమ్మ, 4వ రోజు నానబియ్యం బతుకమ్మ, 5వ రోజు అట్ల బతుకమ్మ, 6వ రోజు అలిగిన బతుకమ్మ, 7వ రోజు వేపకాయల బతుకమ్మ, 8వరోజు వెన్నముద్దల బతుకమ్మ, 9వ రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని ధర్మారం(బి)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని సరయూ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సంగీత శుక్రవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సరయూ పాల్గొంటారని తెలిపారు. సరయూను ప్రిన్సిపాల్ సంగీత, ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీ జ్యోత్స్న తదితరులు అభినందించారు.

చిందు కళాకారిణి కిష్టాబాయి కన్నుమూత



నందిపేట్: ప్రముఖ చిందు కళాకారిణి పులింటి కిష్టాబాయి (70) గురువారం రాత్రి తన స్వగ్రామం నందిపేట మండలం మల్లారంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె చిందు యక్షగానంలో ప్రవీణ్యం పొంది అనేక రాష్ట్రాల్లో ప్రదర్శన చేసి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కేరళ, ముంబై, విజయవాడ వివిధ రాష్ట్రాల కళావేదికలపై ప్రదర్శనలు చేసినందుకు ప్రభుత్వం మెచ్చి 2007లో శతాబ్ది ఉత్సవాల్లో కలెక్టర్ రామాంజనేయులు చేతుల మీదుగా ఉత్తమ విశిష్ట పురస్కార జ్ఞాపికను అందజేసి సత్కరించింది. చెంచులక్ష్మి యక్షగాన నాటకంలో చెంచులక్ష్మి పాత్ర, అల్లిరాణి నాటకంలో అల్లిరాణి పాత్రతో ప్రేక్షకులను ఎంతో అబ్బురపరిచేది కిష్టాబాయి. కిష్టాబాయి మృతి ఎంతో బాధాకరమని చిందు కళాకారుల సంఘం అధ్యక్షుడు పులి నంబూద్రి ప్రసాద్ అన్నారు. ఆమె స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలకు వివిధ పార్టీల నాయకులు, చిందుకళాకారులు హాజరై నివాళులు అర్పించారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

సదాశివనగర్: మండలంలోని భూంపల్లిలో ఈ నెల 7న రాత్రి జరిగిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితులైన ఇద్దరిని పట్టుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. భూంపల్లికి చెందిన తిపిరిసెట్టి రాజయ్య ఇంటి ముందు నిలిపిన బైక్‌ను హైదరాబాద్‌కు చెందిన పల్లం కుమార్, నల్లవెల్లికి చెందిన ఒంటెద్ది సాయి అనే ఇద్దరు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీకి గురైన బైక్‌గా పోలీసులు గుర్తించి ఆరా తీసి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష స్వాధీనం



రెంజల్: రెంజల్ మండలం కందకుర్తి అంతర్రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం తనిఖీల్లో భాగంగా పోలీసులు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని లాథూర్ తాలుకా చకూర్ గ్రామానికి చెందిన రియాస్ షేక్ వద్ద లభించిన రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు తదుపరి చర్య కోసం అందించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

ప్రశాంత్‌రెడ్డి తల్లికి నివాళులు

మంత్రి ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం అశ్రునయనాల మధ్య వేల్పూర్‌లో నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



తల్లి మంజులమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న ప్రశాంత్‌రెడ్డి, ఆయన సోదరి



మంత్రిని ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత, వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి





నివాళులు అర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా



ఎంపీ బీబీపాటిల్



రాజ్యసభ సభ్యుడు సంతోష్



మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్



ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్



మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ



కాంగ్రెస్ నాయకుడు తాహెర్‌బిన్ హందాన్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

సిరికొండ: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిరికొండ కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ షేక్ పర్వీన్, పీఈటీ స్వప్న తెలిపారు. రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో కేజీబీవీకి చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చి పన్నెండు మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో లాంగ్‌జంప్‌లో అంజలి బంగారు పతకం, సంధ్యారాణి వెండి పతకం, హైజంప్‌లో అంజలి బంగారు, సంధ్యారాణి వెండి, గాయత్రి రజత పతకం, షాట్‌పుట్‌లో సంజన బంగారు పతకం, అండర్-16లో జావెలిన్‌త్రోలో శిరీష వెండి, సంధ్య వెండి పతకం, షాట్‌పుట్‌లో పూజ వెండి పతకం, 300 మీ. పరుగు పందెంలో హిందు వెండి పతకం, లాంగ్ జంప్‌లో వెండి పతకం సాధించారని తెలిపారు. బంగారు, వెండి పతకాలు సాధించిన వారు ఈ నెల 25, 26న సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- పదిన్నర క్వింటాళ్ల కాపర్‌వైర్ స్వాధీనం

బాన్సువాడ: ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్లను దొంగిలిస్తున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను శుక్రవారం అరెస్ట్ చేశామని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. వారి వద్దనుంచి రూ.8.5 లక్షల విలువ చేసే కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం ఆయన బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం నర్సింగ్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సంగారెడ్డి వైపు నుంచి అనుమానాస్పదంగా వెళ్తున్న ఓమ్ని వ్యాన్‌ను ఆపేందుకు పోలీసులు యత్నించారన్నారు. అయితే డ్రైవర్ వ్యాన్ ఆపకుండా వేగంగా వెళ్తుండడంతో నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి దానిని వెంబడించి పట్టుకున్నారన్నారు. వ్యాన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన కాపర్ వైర్లు ఉన్నాయన్నారు. వ్యాన్‌లో ఉన్న నలుగురు అనుమానాస్పదంగా కనిపించారని, వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. కామారెడ్డి, పిట్లం, మద్నూర్, భిక్కనూరు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగలిస్తున్నట్లు అంగీకరించారన్నారు. ఇలా దొంగలించిన కాపర్‌వైర్లకు నాందేడ్‌లో విక్రయించడానికి వెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి వద్దనుంచి ఓమ్ని వ్యాన్‌తోపాటు 10.5 క్వింటాళ్ల కాపర్‌వైర్లను స్వాధీనం చేసుకున్నామని, వైరు విలువ రూ.8.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన రబ్బానీ ఉస్మాన్, జహీరాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన షాబుద్దీన్, జహీరాబాద్ మండలంలోని బైలాపూర్‌కు చెందిన మోల్లా ముక్తార్, జహీరాబాద్‌లోని భారత్‌నగర్‌కు చెందిన షేక్ కలీంలపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిపై 37 కేసులు ఉన్నాయని, మొత్తం 62 ట్రాన్స్‌ఫార్మర్లనుంచి వైర్లను దొంగిలించారని తెలిపారు. కేసును ఛేదించిన బాన్సువాడ రూరల్ సీఐ మురళి, నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్సై రాజేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, సీసీఎస్ కానిస్టేబుళ్లు గణపతి, రాజు, రవి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నిజాంసాగర్, పిట్లం సిబ్బందిని అభినందించారు. వీరందరికీ క్యాష్ రివార్డులు అందిస్తామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

కాలేజీ పక్కనే కోళ్ల వ్యర్థాలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన కోళ్ల కళేబరాలు, వ్యర్థాలతో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో కంపు కొడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల పక్కన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలం క్రాస్ చేస్తు జాతీయ రహదారి 44 బైపాస్ నిర్మించారు. బైపాస్ రోడ్డు అటు వైపున గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డు ఉంది. ఇవతలి వైపు ఎలాంటి యార్డు లేకున్న అక్కడనే చెత్తను తీసుకు వచ్చి వేస్తున్నారు. దీంతో గాలి వీచినప్పుడు కళాశాలలోకి భరించ లేని దుర్వాసన వస్తోంది. చెత్తతో పాటు కోళ్ల వ్యర్థాలను తీసుకు వచ్చి అక్కడ వేస్తున్నారు. ఈ మధ్యనే బాల్కొండ మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. జూనియర్ కళాశాల ఆవరణలోనే డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం చెత్తాచెదారంఎక్కడైతే వేశారో అటు వైపు ఉన్న గదుల్లోనే డిగ్రీ తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగింపజేయాలని కోరుతున్నారు.



బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

పలుమార్లు ఫిర్యాదు చేశాం

కళాశాల పక్కన ఆవరణలో చెత్తను వేయడంతో వాసన భరించలేక పోతున్నామని పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ ఇప్పటికీ చెత్తను తొలిగించలేదు. వేయడం మానిపించ లేదు. చేసేది లేక ఊరుకున్నాం.

– చిన్నయ్య, ప్రిన్సిపాల్

జడ్జి సంపత్‌కు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయశాస్త్ర కళాశాల పరిశోధక విద్యార్థి, మంచిర్యాల జిల్లా చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ సంపత్ డాక్టరేట్ సాధించారు. తెయూ రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎల్ శోభారాణి పర్యవేక్షణలో 'రోల్ అండ్ ఇంపార్టెన్స్ ఆఫ్ ఫోరెన్సిక్ అండ్ సైంటిఫిక్ ఎవిడెన్స్ ఇన్ సివిల్ అండ్ క్రిమినల్ కేసెస్-ఏ స్టడీ' అనే అంశంపై సంపత్ పరిశోధన గ్రంథం సమర్పించారు. శుక్రవారం తెయూ లా కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ రాంప్రసాద్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో లా డీన్ ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, హెచ్‌వోడీ, ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, అధ్యాపకులు బి స్రవంతి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. డాక్టరేట్ సాధించిన సంపత్‌ను రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు.



సంపత్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

వర్సిటీలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మతో రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు



తెయూ పరిపాలనా భవనం వద్ద బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఎం యాదగిరి బతుకమ్మకు పూజలు చేశారు. అనంతరం పరిపాలనా భవనం ఎదుట బతుకమ్మలను ఒక్కచోట చేర్చి వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ ఆనందోత్సవాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, మహిళా విభాగం డైరెక్టర్ భ్రమరాంభిక, ఈసీ మెంబర్ రవీందర్‌రెడ్డి, ఆర్ట్స్ డీన్ వి త్రివేణి, అధ్యాపకులు లావణ్య, నందిని, నీలిమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'బతుకమ్మ పేర్చడం' పోటీలో కంపూటర్ సైన్స్ విద్యార్థులు బహుమతి సాధించారు.

అక్రమాల నిరోధానికి ప్రత్యేక బృందాలు

- మండల స్థాయిలో ఏర్పాటు
- డబ్బు, మద్యం, వస్తువుల పంపిణీని నిరోధించేందుకు ప్రయత్నం

మోర్తాడ్(బాల్కొండ) : రాష్ట్ర శాసనసభకు ఎన్నికల షెడ్యూల్ వెలువడం, నియమావళి అమలులోకి రావడంతో అక్రమాల నిరోధానికి మూడు ప్రత్యేక బృందాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. మండల స్థాయిలో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పడగా ఒక బృందం మాత్రం మూడు మండలాలకు తమ నిఘాను విస్తరించనుంది. సర్వైవల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందంతో పాటు టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పా టు చేశారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరా జ్ శాఖలను సమన్వయం చేస్తూ వివిధ విభాగాల ఉద్యోగులను ఈ బృందాల్లో నియమించా రు. ప్రతి బృందానికి ఒక వీడియో గ్రాఫర్‌ను ని యమించారు. తనిఖీల్లో పారదర్శకత లోపించకుండా ఉండటానికి వీడియోగ్రాఫర్ చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి రోజువారి నివేదికను అందించాల్సి ఉంది. మండల స్థాయిలో ఏర్ప డిన టాస్క్‌ఫోర్స్ బృందం తమ మండలం పరిధిలో కాకుండా మరో రెండు మండలాల్లో పని చేయాలని అధికారులు నిర్దేశించారు. టాస్క్‌ఫో ర్స్ బృందాలు మూడు మండలాల్లో షిఫ్ట్ పద్ధతిలో ఎన్నికల తంతు ముగిసే వరకు పని చేయాల్సి ఉంది. సర్వైవల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు మాత్రం తమ మండల పరిధిలో పని చేయాల్సి ఉంది. జిల్లాలోని అన్ని రెవెన్యూ మండలాల్లో మంగళవారం నుంచి నిఘా బృందాలు రంగంలోకి దిగాయి. మద్యం, డబ్బులు, విలువైన బహుమతులు పంపిణీ చేసి అభ్యర్థులు ఓటర్లను ప్రలోభానికి గురి చేయకుండా ఉండటానికి ఈ నిఘా బృందాలు పని చేయాల్సి ఉంది. ప్రతి బృందానికి పోలీసుల సహకారం పక్కాగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. నిఘా బృందంలోని ఉద్యోగులకు ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సెలవులను రద్దు చేశారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగడానికే నిఘా పెంచారని అధికారులు వెల్లడించారు.

క్రైం కార్నర్

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దకొడప్‌గల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్రమైసని సంతోష్(25) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

చేపూర్‌లో అగ్ని ప్రమాదం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలంలోని చేపూర్‌లో ఆర్ లోకేష్ అనే వ్యక్తికి చెందిన ఆయిల్‌పాం నర్సరీ గోదాంలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో ల్యాప్‌టాప్, గ్రాస్‌కట్టర్, కెమికల్స్ ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్‌ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

రామారెడ్డి: మండలంలోని గోకుల్‌తండాకు చెందిన మెగావత్ జ్యోతి అదృశ్యమైనట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు బైక్‌లు ఢీ

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలం తుర్కపల్లి గేటు వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తుర్కపల్లికి చెందిన ఒకరు, దూప్‌సింగ్ తండాకు చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రంజిత్(ఫైల్)

నిజామాబాద్‌రూరల్: నగరంలోని ముబారక్‌నగర్ సుజిత్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోదాసు రంజిత్ (19) మృతి చెందాడు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మాక్లూర్ మండలం మామిడిపల్లికి చెందిన బోదాసు రంజిత్, బోదాస్ గంగాధర్ వరుసకు అన్నదమ్ములు. వీరు ఇద్దరు మేస్త్రీ పనిచేయడానికి నగరానికి వస్తున్నారు. గంగాధర్ బైక్ నడుపుతుండగా రంజిత్ వెనక కూర్చున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల నుంచి నిజామాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. వెనక కూర్చున్న రంజిత్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం, సుజిత్ ఫ్యాక్టరీకి సంబంధించిన లారీలు రోడ్డుపై నిలిపి ఉండటంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు రోడ్డు బైఠాయించారు. దీంతో దాదాపు గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని ఎస్‌హెచ్‌వో హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కంటైనర్‌ను ఢీకొని వృద్ధుడు..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం బీబీపూర్ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఇందల్వాయి తండాకు చెందిన బదావత్ ధర్మ(65) మృతి చెందాడు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. ధర్మ డిచ్‌పల్లి నుంచి రాత్రికి తన బైక్‌పై ఇందల్వాయి తండాకు బయలుదేరాడు. బీబీపూర్ వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి జాలరి..

ఎల్లారెడ్డి: చేపలు పట్టేందుకు వెళ్లిన ఒకరు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన పసుపుల సాయిలు(27) నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లోకి గురువారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం బ్యాక్ వాటర్‌లో సాయిలుకు సంబంధించిన తెప్ప మాత్రమే ఉందని జాలర్లు సాయిలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెళ్లి వెతికినా ఎలాంటి ఆచూకీ లభ్యంకాలేదు. శుక్రవారం మళ్లీ వెతకగా బ్యాక్ వాటర్‌లో సాయిలు మృత దేహం లభ్యమైంది. సాయిలు వలలో చిక్కుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యసాయ బావిలో పడి బాలుడి మృతి



తాడ్వాయి: తాడ్వాయి శివారులోని వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తాడ్వాయికి చెందిన దమ్మన్నగారి రఘు పెద్ద కుమారుడు రామకృష్ణారెడ్డి(13)కి మతి స్థిమితం సరిగ్గా లేదు. శుక్రవారం కుటుంబ సభ్యులు రామకృష్ణారెడ్డిని తమ వెంట పొలం వద్దకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులు చేస్తుండగా రామకృష్ణారెడ్డి స్నానం చేస్తానని బావి వద్దకు వెళ్లాడు. బావి పక్కన ఉన్న కుండిలో నీళ్లు లేక పోవడంతో బావిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు.

గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు శుక్రవారం గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు 50 ఏళ్ల వరకు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. యాచకుడు కావచ్చనీ, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.